ఆదివారం
ప్రజాశక్తి
నవంబర్ 17, 2002

అభివృద్ధి పథంలో చైనా

లాంగ్‌మార్చ్

హ్యాపీ బర్త్‌డే

(17-11-2002 నుండి 23-11-2002 వరకు)

కౌశిక్, రచన (కవలలు)
2సం॥, 17.11.2000
అపర్ణ-వెంకటరమణ
ఏలేశ్వరం-తూర్పుగోదావరి జిల్లా

ఎన్. శివ
2సం॥, 17.11.2000
సంతోష- వెంకటేష్
ఆరుట్ల-రంగారెడ్డి

మన్సూర్ అలీ
1సం॥, 17.11.2001
మస్తాన్‌బీ-మస్తాన్
అమీనాబాద్-నల్లగొండ

పి.జయలక్ష్మి
5సం॥, 17.11.1997
పద్మావతి-కృష్ణమూర్తి
ఫరిదిపేట-శ్రీకాకుళం

కె.కార్తిక్
4సం॥, 17.11.1998
సుధ-వెంకటరమణ
వికారాబాద్- రంగారెడ్డి

డి.ప్రియాంక
7సం॥,18.11.1995
నిర్మల- ఈశ్వరయ్య
శంకర్‌పల్లి -రంగారెడ్డి

పింగళి ఫణికుమార్
నవంబర్-18
వాణి- శేషసాయి
శ్రీకాకుళం జిల్లా

ఇ. తరంగ్
1సం॥, 18.11.2001
జంగమ్మ- గాలయ్య
మంచాల- రంగారెడ్డి

అర్బాబ్‌ఖాన్
నవంబర్-18
షబాన- బాబాఫక్రోద్దీన్
ఓబుళదేవర చెరువు- అనంతపురం

మటపర్తి సాయిసుష్మ
8సం॥, 19.11.1994
హేమమాలిని-చంద్రశేఖర్
అమలాపురం

పి.వి.ఎస్. చౌదరి
1సం॥,19.11.2001
అన్నపూర్ణ-శ్రీనివాసరావు
వేమవరం-ప్రకాశం

అత్తోట చంటి
3సం॥, 19.11.1999
లక్ష్మి-సువర్ణరాజు
చీమకుర్తి-ప్రకాశం

షేక్ సోహైల్ ఫర్వేజ్
మొదటి సం॥
రుక్సానా- మహమ్మద్‌రఫీ
ఇంకొల్లు- ప్రకాశం

పి.సంఘవి
5సం॥21.11.1997
సునీత-భాస్కర్
ముషీరాబాద్- హైదరాబాద్

ఎస్.కె.అజారుద్దీన్
5సం॥,21.11.1997
జరీనాబేగం- లక్టర్ బాబు
లింగగూడెం- ఖమ్మం జిల్లా

జ్యోతి సురేఖ(అమ్ములు)
1సం॥, 21.11.2001
జోస్‌మేరీ-జగన్మోహనరావు
ఘంటసాల- కృష్ణా జిల్లా

పి.సన్నిబాబు
1సం॥, 21.11.2001
రత్నకుమారి-మోహన్‌కుమార్
శృంగవృక్షం

అనుముల భాగ్యశ్రీ
4సం॥, 23.11.1998
నాగమణి-ప్రసన్నగణేష్
బొందలవాడ- అనంతపురం

మూడు రకాల మందులు వాడవలసి వస్తుంది. వయస్సు స్త్రీలయితే గర్భస్థ దశ, మొదలైన అంశాలను దృష్టిలో పెట్టుకుని వైద్యులు మూర్ఛ వ్యాధి మందులను నిర్ణయించడం జరుగుతుంది. మందులను ఆయా కారణాలను బట్టి కొన్ని నెలల నుండి కొన్ని సంవత్సరాలు వాడవలసి ఉంటుంది. అయితే చాలా మంది రోగులు కొన్ని రోజుల పాటు మూర్ఛలు కనవడకపోతే, వైద్యునిసంప్రదించకుండానే మందులు మానేయడం జరుగుతుంది. అందువల్ల కొందరిలో మూర్ఛలు తిరగబెట్టి, మరి కొందరిలో "స్టాటస్ ఎపిలెప్టికస్' అనే దశకు చేరి ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. వైద్యుని సలహాను నిర్లక్ష్యం చేసి మందులు వాడకుండా మానేయడం వల్లనే నేడు మూర్ఛవ్యాధి కారణంగా మరణాలు సంభవిస్తున్నాయి. క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాల పాటు వైద్యుని పర్యవేక్షణలో మందులు వాడితే మూర్ఛలను పూర్తిగా నిరోధించి సాధారణ జీవితాన్ని పొంద వచ్చును. మూర్ఛ వ్యాధి కాలవారు వాహనాలు నడపడం, చెట్లు, స్థంభాలు ఎక్కడం, ఒంటరిగా ఈతకు వెళ్ళడం, కర్మాగారాలలో యంత్రాల దగ్గర పని చేయడం మంచిది కాదు.

వ్యక్తి మూర్ఛలకు గురి అయినప్పుడు బట్టలు బిగుతుగా ఉండకుండా వదులు చేయాలి. కళ్లజోడు, కట్టుడు పళ్ళు ఉంటే తీసేయాలి. రోగి మూర్ఛలో ఉన్నప్పుడు దెబ్బలు తగలకుండా చూడాలి. రోగిని ప్రక్కకు తిప్పడం ద్వారా నోటి నుంచి వచ్చిన నురుగు ఊపిరితిత్తులలోకి వెళ్ళకుండా జాగ్రత్త వహించాలి. మూర్ఛలు వచ్చినప్పుడు రోగిని గట్టిగా ఆపే ప్రయత్నం చేయకూడదు. మూర్ఛరోగి చుట్టూ జనం గుమిగూడకూడదు. గాలి బాగా పీల్చుకునేందుకు అవకాశం కల్పించాలి. మూర్ఛకు గురై స్పృహ కోల్పోయినప్పుడు స్పృహ వచ్చేంత వరకు తిను పదార్థాలు, తాగే ద్రవాలు ఇవ్వకూడదు. మూర్ఛలు వచ్చినప్పుడు నెత్తిపై నీళ్ళు కుమ్మరించడం, చేతిలో తాళాలు పెట్టడం వల్ల మూర్ఛలు ఆగవు. అవి కేవలం అపోహలు మాత్రమే. వాటి వల్ల రోగికి ప్రయోజనం లేకపోగా, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదాలున్నాయి. మూర్ఛలు ఆగిన వెంటనే రోగిని సాధ్యమైనంత త్వరలో వైద్యుని దగ్గరకు తీసుకువెళ్ళాలి.

మూర్ఛ వ్యాధి కలవారు ఎల్లప్పుడు జేబులో వ్యాధి వివరాలు, వాడే మందుల వివరాలు గల కార్డును కలిగి ఉండటం మంచిది. వ్యక్తి స్పృహలో లేనపుడు, తెలిసిన బంధు మిత్రులు లేనప్పుడూ వ్యాధి నిర్ధారణ, చికిత్సలకు ఆ కార్డు ఎంతగానో ఉపయోగ పడుతుంది ఏది ఏమైనా ప్రజలు వ్యాధిపై శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలి. తద్వారానే మూర్ఛల వ్యాధిని నిరోధించాలి. ఆ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ★

హైపటైటిస్ 'బి' వ్యాధికి చికిత్స లేదు, నివారణ ఒక్కటే శరణ్యం

ఆధునిక ప్రపంచాన్ని గజగజలాడిస్తున్న ఎయిడ్స్ వ్యాధి కంటే భయంకరమైన వ్యాధి హైపటైటిస్ 'బి'.

ఎయిడ్స్ వ్యాధి రావడానికి గాని, దాని లక్షణాలు శరీరం మీద బయటపడటానికి గాని, మనిషి మృత్యువాత పడటానికి గానీ కొంత వ్యవధి ఉంటుంది. హైపటైటిస్ 'బి' కామెర్ల వ్యాధి అంతలోనే ముంచుకొచ్చి చూస్తుండగానే నిలువెత్తు మనిషి నిండు ప్రాణాలు తీసుకుపోతుంది. మనం జాగ్రత్త పడి, చికిత్స తీసుకునే వ్యవధి కూడా వుండదు. ఆ విధంగా ఇది ఎయిడ్స్ కన్నా భయంకరమైనది. ఎయిడ్స్‌లాగానే ఇది శరీరంలో చాలా కాలం నిశ్శబ్దంగా ఉన్నప్పటికీ, మనం గమనించలేకపోవడానికి ఒక్కసారి ముంచుకొచ్చినట్లు లక్షణాలు బైటపడతాయి.

కామెర్ల వ్యాధి రెండు రకాలుగా వుంటుంది. ఒకటి మామూలుగా వచ్చే కామెర్లు. దీన్ని మామూలు హైపటైటిస్ అంటారు. రెండోది చావును కొని తెచ్చే హైపటైటిస్. దీన్ని హైపటైటిస్ 'బి' అంటారు.

హైపటైటిస్ 'బి' కామెర్లు రావటానికి అనేక కారణాలున్నాయి. ఆ వ్యాధి ఉన్న వ్యక్తుల రక్తాన్ని వేరొకరికి దానం చేయడం గాని, ఆ వ్యాధి ఉన్న వ్యక్తులకు చేసిన ఇంజక్షన్ సూదులతో వేరే ఆరోగ్యవంతులకు ఇంజక్షన్‌లు చేయడం గాని, ఆ వ్యాధి సోకిన వ్యక్తులతో లైంగిక సంపర్కం పెట్టుకోవడం గాని ముఖ్య కారణాలుగా ఈ వ్యాధి వస్తుంది. దాదాపుగా ఎయిడ్స్ వ్యాధి ఏ ఏ కారణాల వలన వస్తుందో ఆ కారణాలన్నీ హైపటైటిస్ 'బి' వ్యాధిని తీసుకువస్తాయి. కాకపోతే ఎయిడ్స్ వ్యాధికి హైచ్.ఐ.వి. వైరస్ కారణం అయితే హైపటైటిస్ 'బి' వైరస్ (హెచ్‌బివి) ఈ వ్యాధికి కారణం అవుతుంది.

వైరస్ వలన కలిగే వ్యాధులకు చికిత్స లేదన్న సంగతి ఇక్కడ గమనార్హం. కామెర్లకు చికిత్స చేసినంత సులభం కాదు హైపటైటిస్ 'బి' చికిత్స. కామెర్లు వస్తే వాతలు పెట్టించుకోవడం, పసర్లు తాగడం వంటి చికిత్సలతో సరిపెట్టుకుంటూ వుంటారు కొందరు. మామూలుగా వచ్చే కామెర్లకు ఈ చికిత్సలు సరిపోవచ్చు. వాటిని తీసుకున్నా, తీసుకోకపోయినా ఆహారంలో మార్పులు చేసి విశ్రాంతి తీసుకుంటే కొన్ని రోజులకు ఆ కామెర్లు సహజంగానే తగ్గిపోతూ ఉంటాయి. కాని హైపటైటిస్ 'బి' వచ్చినట్లయితే, ఈ చికిత్సలు రోగి ప్రాణాలను కాపాడలేవు.

ప్రాణాల మీదకి వచ్చే ఈ వ్యాధి బారిన మనం పడకుండా వుండాలంటే :

1 హెచ్‌బివి వలన వచ్చే ఈ హైపటైటిస్ 'బి' జబ్బు రక్తంలో వుండిపోయి, పైకి కన్పించకుండా రహస్యంగా దాగి వుంటుంది. క్రమంగా లివర్ ఫెయిల్యూర్‌కు గానీ, లివర్‌లో కాన్సర్‌కు గానీ దారి తీసి మరణాన్ని తీసుకువస్తుంది.

2 మనదేశంలో ఇప్పటికే 4.3 కోట్ల మంది ఈ వ్యాధి పాలిట పడ్డారని అంచనా. అందులో మూడవ వంతు మందిపిల్లలే.

3 తల్లి గర్భవతిగా ఉన్నప్పుడే ఈ వ్యాధిని తన రక్తం ద్వారా కడుపులో ఎదిగే బిడ్డకు చేరుస్తుంది. ఇదంతా ఆమెకు తెలియకుండానే జరిగిపోతుంది.

4 ఈ వ్యాధి ఉన్న పెద్ద వాళ్ళు చంటిపిల్లలని ఎత్తుకొని ముద్దాడడం వలన కూడా చంటి పిల్లలకు ఈ వ్యాధి సంక్రమించవచ్చు. చంటి పిల్లలు ఈ వ్యాధిసోకిన వ్యక్తులు వాడిన వస్తువులను నోటిలో పెట్టుకోవడం, వాటిని వినియోగించటం వలన ఈ వ్యాధి బారిన పడతారు.

హైపటైటిస్ 'బి' వ్యాక్సిన్

ముందు జాగ్రత్త చర్యగా హైపటైటిస్ 'బి' వ్యాక్సిన్‌ను తీసుకోవాలి. ఇప్పుడు ఇది ఇండియాలో చాలా తేలికగా లభ్యం అవుతోంది. ఎయిడ్స్ వవ్యాధికి ఈనాటికీ వ్యాక్సిన్ కనుక్కోవడం జరగలేదు. హైపటైటిస్ 'బి' మహమ్మారికి మాత్రం వ్యాక్సిన్ వచ్చింది. ఈ వ్యాక్సిన్ కొంత ఖరీదే అయినప్పటికీ, సామాన్య మానవుడికి అందుబాటులో లేనప్పటికీ ప్రయత్నం చేసి తప్పనిసరిగా ప్రతిఒక్కరూ విధిగా ఈ వ్యాక్సిన్ తీసుకోవాలి.

వాక్సిన్ తీసుకోవలసిన షెడ్యూల్

వాక్సిన్ షెడ్యూల్ ఈ విధంగా వుంటుందది. 10 సం॥లలోపు వరకు 0.5 సిసి ఇంజక్షన్ రూపేణా ఇవ్వాలి. 10 సంవత్సరాల పైబడ్డ వారికి ఏ వయస్సులో ఉన్నా సరే 1 సిసి ఇంజక్షన్ ఇవ్వాలి. మొదటిసారి ఇంజక్షన్ చేయించుకున్న తర్వాత సరిగ్గా నెల రోజులకు 2వ ఇంజక్షన్, 5వ నెలలో అదే రోజున మూడవ ఇంజక్షన్ చేయించుకుంటే సరిపోతుంది. ప్రస్తుతం ఈ వ్యాక్సిన్ ఇండియాలో తయారవుతున్నది. ఈ వ్యాధి బయటపడిన తరువాత మనం చేయగలది ఏమీ లేదు. రాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త తీసుకుంటే ఈ వ్యాధిని ఈ తరంలోనే శాశ్వతంగా అంతం చేయగలుగుతాం. కాబట్టి వ్యాక్సిన్‌ను చిన్నా, పెద్దా, ముసలీ ముతక అందరూ తీసుకోవడమే తగిన చర్య. ★

అంపశయ్య నవీన్

చీకటి బతుకులు



ఓ మిత్రునింటికెళ్దామని స్కూటర్ మీద బయల్దేరాను. ఓ కిలోమీటర్ దూరం వెళ్ళేటప్పటికి స్కూటర్ ఆగిపోయింది. పెట్రోల్ అయిపోయిందేమోనని టాంక్ ఓపెన్ చేసి చూశాను. పెట్రోల్ చాలానే ఉంది. ఎన్నిసార్లు కిక్ కొట్టినా స్కూటర్ స్టార్ట్ కాలేదు. ఏం చేద్దామా అని ఆలోచిస్తూ రోడ్డు పక్కన నిల్చొని అటూఇటూ చూస్తున్నాను. రోడ్డు పక్కనే ఉన్న ఓ పాన్‌షాపతను నా సమస్యను గమనించి "దగ్గర్లోనే స్కూటర్లు బాగా చేసే వర్క్‌షాపు ఉందిసార్ కొంచెం దూరం... చక్కగా వెళ్ళండి.. ఆ మెకానిక్ షాపొస్తుంది" అన్నాడు.

అతనికి 'థాంక్స్' చెప్పి స్కూటర్‌ని తోసుకుంటూ ఓ ఫర్లాంగ్ దూరం వెళ్ళాను. రోడ్డు పక్కనే స్కూటర్లను బాగు చేసే వర్క్‌షాపుంది. అది చాలా పెద్ద షాపే. నేను వెళ్ళేటప్పటికే అక్కడ ఐదారు స్కూటర్లున్నాయి. ఇద్దరు మెకానిక్‌లు ఓ రెండు స్కూటర్లని మొత్తం విప్పేసి బాగు చేసే పనిలో ఉన్నారు. అక్కడున్న హెడ్ మెకానిక్ అనుకుంటాను నన్ను చూడగానే 'ఏమైందిసార్?' అని అడిగాడు.

'స్కూటర్ మధ్యలో ఆగిపోయింది. స్టార్ట్ కావడం లేదు' అన్నాను.

'పెట్రోల్ ఉందా?' అన్నాడతడు.

'రెండు మూడు లీటర్ల పెట్రోల్ ఉంది' అన్నాను.

"అరేయ్ శంకర్ సార్ బండికి కార్బనొచ్చినట్లుంది చూడు - క్లీన్ చేసి పంపియ్యి" అన్నాడు. ప్లగ్‌పానా పట్టుకొని నా దగ్గరకొచ్చిన ఆ శంకర్‌ను చూసి నేను చాలా ఆశ్చర్యపడ్డాను. అతనికి ఎనిమిదేళ్ళు కూడా ఉంటాయో, ఉండవో అనిపించింది. చిరిగిపోయిన ఓ బనియన్, నిక్కర్ వేసుకున్నాడు. అతడు వేసుకున్న ఆ కాస్త డ్రెస్సు నిండా నల్లటి ఆయిల్ మరకలున్నాయి. ఆ కుర్రాడు నా స్కూటర్ దగ్గరకొచ్చి ప్లగ్‌పానాతో ప్లగ్‌పిన్‌ను బయటకు తీసి, దాన్ని క్లీన్ చేసి దాని ద్వారా కరెంట్ పాసవుతున్నదో లేదో చెక్‌చేసి మళ్ళీ దాని స్థానంలో ఫిక్స్ చేసేశాడు. తర్వాత కిక్‌రాడ్‌మీద కాలు పెట్టి రెండుమూడు సార్లు గట్టిగా కొట్టాడు. స్కూటర్ స్టార్టయిపోయింది. ఈ పనంతా ఆ ఎనిమిదేళ్ళ కుర్రాడు ఎంతో అనుభవజ్ఞుడైన మెకానిక్‌లా ఓ ఐదారు నిముషాల్లోనే పూర్తి చేశాడు.

'అయిపోయింది - మీ బండి తీసుకపోండ్రిసార్!' అన్నాడు హెడ్ మెకానిక్. నేనతడు కూర్చున్న సీటు దగ్గరకెళ్ళి ఎంతివ్వమంటావు అన్నాను.

'ఓ పది రూపాయలివ్వండి సార్' అన్నాడతడు. ఈ పది రూపాయల్లో శంకర్‌కు ఓ రూపాయైనా ముడుతుందా అనుకున్నాను - అంతమాత్రం కూడా ముట్టదేమో! హెడ్‌మెకానిక్ చేతిలో పదిరూపాయల నోట్ పెడ్తూ అతని షాపులో పని చేస్తున్న వాళ్ళందర్నీ ఓసారి చూశాను.

శంకర్ ఒక్కడే కాదు - శంకర్ వయస్సే ఉన్న ఇంకో ఇద్దరు పసి కుర్రాళ్ళు కూడా ఆ షాపులో పని చేస్తున్నారు. స్కూటర్లు బాగు చేస్తున్న సీనియర్ మెకానిక్‌లు ఏది తెచ్చివ్వమంటే ఆ కుర్రాళ్ళు వెంటనే అది తెచ్చిస్తున్నారు. ఆ తెచ్చివ్వడంలో ఏ కొంచెం ఆలస్యమైనా సీనియర్ మెకానిక్‌లు ఆ కుర్రాళ్ళను నోటికొచ్చినట్టల్లా బూతులు తిడుతున్నారు. ఏదో స్క్రూడ్రైవర్ తెమ్మని సీనియర్ మెకానిక్ అతని పక్కనే ఉన్న అన్వర్ అనే కుర్రాడికి చెబితే ఆ అన్వర్ షాపులో కెళ్ళి దానికోసం చాలాసేపు వెతికాడు. అతనికది దొరకలేదు.

"దొరుకతలేదన్నా!" అన్నాడా కుర్రాడు షాపులోంచి బయటకొచ్చి.

"దొరుకతలేదురా గాడిదకొడుకా! నీకసలు కండ్లు కనబడ్తలేవురా.. నీకు మదమొచ్చిందిరా!" అంటూ స్కూటర్ బాగు చేస్తున్న మెకానిక్ లేచి లోపలకొచ్చి అతనికి కావలసిన స్క్రూడ్రైవర్‌ను కాసేపు వెతికి తెచ్చుకున్నాడు.

"ఇదేందిరా స్క్రూడ్రైవర్! ఎక్కడ జూసినవురా నువ్వు! నీ కండ్లకు కావరమొచ్చిందిరా!" అంటూ ఎన్నో బూతులు తిడ్తూ ఆ అన్వర్ అనే కుర్రాడి వీపుమీద ఎడాపెడా కొట్టసాగాడు.

"అదేమిటి? అంత చిన్న కుర్రాడ్ని పట్టుకొని అట్ల కొడ్తున్నవేంది.. అసలు ఇంత చిన్న పిల్లల తోటి పని చేయించుకోవడమే తప్పు.. చట్టరీత్యా నేరం..." అన్నాన్నేను.

"మీకేంది సార్! మాటలు బాగానే చెప్తున్నారు.. వాడేమన్న మా దగ్గర పుణ్యానికి పని చేస్తున్నడనుకున్నారా? వానయ్యకు వెయ్యి రూపాయలు అప్పిచ్చిన.. వాన్ని రెండు పూటలా మేపుతున్న - వాని అయ్యొచ్చి నా కాళ్ళు పట్టుకుంటేనే వాన్ని నా షాపుల పెట్టుకున్న..." అన్నాడు హెడ్‌మెకానిక్.

"ఒక్కడే కాదు.. మీ దగ్గర ముగ్గురు చిన్న పిల్లలు పని చేస్తున్నారు... స్కూలుకెళ్ళి హాయిగా చదువుకోవలసిన వాళ్ళతో ఇలా రోజుకు పదహారు గంటలు పని చేయించుకోవడం... మీరు చెప్పిన పనుల్ని చెయ్యడంలో వాళ్ళు ఏ కొంచెం ఆలస్యం చేసినా వాళ్ళను నోటికొచ్చినట్టు తిట్టడం, నిర్దాక్షిణ్యంగా కొట్టడం చాలా అన్యాయం... పద్నాలుగేళ్ళు నిండని చిన్న పిల్లలతో ఇట్లా పని చేయించుకోవటం నేరమని చట్టం చేసిన మన ప్రభుత్వం ఆ చట్టాన్ని అమలు చేసే విషయంలో తగినంత శ్రద్ధ చూపించడం లేదు... మీరు కూడా ఇంత పసివాళ్ళతో పని చేయించుకోవడం తప్పని అనుకోవడం లేదు... పైగా వాళ్ళతో మీరు చాలా క్రూరంగా ప్రవర్తిస్తున్నారు" అన్నాను.

"ఇట్లాంటి పోరగాళ్ళను పెట్టుకోకపోతే మీలాంటి వాళ్ళొచ్చినప్పుడు వెంటనే మీ కోసం ఎవరొస్తరు సార్! మీరు స్కూటర్ నెట్టుకుంటూ మా షాపుకొస్తిరి - వెంటనే మీ స్కూటర్‌కేమయ్యిందో చూడలెగద. ఉన్న ఇద్దరు మెకానిక్‌లు పని చేస్తనే ఉండిరి - వాళ్ళ చేతిమీదున్న పని వదిలి పెట్టి మీ దగ్గరకు రారుగద... మీ స్కూటర్‌ది చిన్న పనే... ఇక్కడున్న పోరగాళ్ళకు అట్లాంటి చిన్న పనులు ఎట్ల చెయ్యాల్నో నేర్పిస్తం. వాళ్ళు కొన్ని నిమిషాలల్ల మీ అసుంటోళ్ళ పని పూర్తి చేసి పంపిస్తరు... వాళ్ళా పని చేస్తున్నందుకు వీళ్ళకు రెండు పూటలు తిండి పెడ్తున్నం. రెండుసార్లు ఛాయ్‌లు తాగిపిస్తున్నాం.. వాళ్ళను మేం ఈ పనిలో పెట్టుకోలేదనుకోండ్రి వాళ్ళకు ఈ మాత్రం తిండి కూడా దొరకదు. తిండి లేకుంట వాళ్ళెట్ల బతుకుతరో మీరే చెప్పండ్రి" అన్నాడు హెడ్ మెకానిక్.

"ప్రభుత్వం ఇలాంటి పేద పసి పిల్లల్ని బళ్ళో చేర్పించి వాళ్ళకు భోజనాలు కూడా పెట్టి చదివించాలి.. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టానని మన ముఖ్యమంత్రిగారంటున్నారు కదా... అప్పుడైనా ఈ సమస్య తీరుతుందేమో చూడాలి" అంటూ నేనక్కడ్నించి కదిలాను. ★

ఎం.డి.హాసన్ షరీఫ్

ఇదేనా క్రీడాస్ఫూర్తి ?

"జంషెడ్పూర్, నాగపూర్‌లలో చాలా అలజడి జరిగినా మ్యాచ్‌ను పూర్తి చేశారు. ఆ రెండు స్థానాలతో పోలిస్తే ఇక్కడ చాలా తక్కువ గొడవ జరిగింది. అయినా మ్యాచ్‌ను రద్దుచేయడం సరైన చర్యకాదు. ఇక్కడ ఒక వాటర్ బాటిల్, ఒక్క కాగితపు ముక్క మాత్రమే పడ్డాయి. ఇంతచిన్న సంఘటనకే ఏకంగా మ్యాచ్‌ను రద్దుచేయడం డబ్బులు పెట్టి టికెట్లు కొన్న మమ్ములను మోసం చేయడమే."

-రాజ్‌కోట్ మ్యాచ్ రద్దవడంతో స్టేడియంలో ఓ అభిమాని ఆవేదన

క్రీడా స్ఫూర్తికి భారత క్రీడాభిమానులు గొప్ప ఉదాహరణగా నిలుస్తారని ఇప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా పేరుండేది. అయితే ఇటీవల భారత్-వెస్టిండీస్ క్రికెట్ జట్ల మధ్య జరిగిన మూడు వన్డే మ్యాచ్‌లలో ప్రేక్షకులు సృష్టించిన అల్లర్లను పరిశీలిస్తే ఈ అంచనా తప్పేమో అనే అనుమానం వస్తోంది. సాధారణంగా స్వదేశంలో మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు భారత జట్టు ప్రత్యర్థి చేతిలో ఓడిపోయే పరిస్థితుల్లో మన అభిమానులు ఎంత బాధపడినప్పటికీ హుందాతనాన్ని విడనాడేవారు కాదు. విజయం సాధించిన ప్రత్యర్థి జట్ల ఆటగాళ్లను అభినందించిన సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతో ప్రపంచ వ్యాప్తంగా భారత క్రీడాభిమానులకు ప్రత్యేక గుర్తింపు లభించింది. అయితే వెస్టిండీస్‌తో జరిగిన తొలి మూడు వన్డేల్లో ప్రేక్షకులు మ్యాచ్‌కు అంతరాయం కలిగించడాన్ని భారత్ జీర్ణించుకోలేని పరిస్థితి ఏర్పడింది.

అంతరాయానికి కారణమేంటి ?

తొలి రెండు మ్యాచ్‌లలో భారత్ ఓటమి పరిస్థితుల్లో ఉన్నప్పుడు కొంతమంది ప్రేక్షకులు విండీస్ ఆటగాళ్లపై ఖాళీ వాటర్ బాటిళ్లను విసరడం ఆవేశాన్ని ఆపుకోలేక జరిగివుండవచ్చు. అయితే మూడో వన్డేలో భారత్ స్పష్టమైన ఆధిక్యంతో విజయం వైపుకు దూసుకెళ్తున్నప్పుడు కూడా ప్రేక్షకులు ఆగ్రహం వ్యక్తం చేయడానికి కారణమేంటి? ఇది ప్రేక్షకులు ఆవేశంతో చేసిన పనా లేక కొంత మంది 'అల్లరి మూకలు' మ్యాచ్‌కు అంతరాయం కలిగించాలనే ఉద్దేశంతోనే స్టేడియంలోకి వచ్చారా! అనే అనుమానం కలుగుతుంది. వరుసగా మూడు మ్యాచ్‌లకు అంతరాయం కలగడాన్ని బట్టి చూస్తే అల్లరి చేసే ప్రేక్షకులు ప్రత్యేకంగా ఉన్నారనే అనుమానం బలపడుతోంది. రాజ్‌కోట్ వన్డేలో విండీస్ నెలకొల్పిన భారీ లక్ష్యాన్ని భారత బ్యాట్స్‌మెన్ అలవోకగా అధిగమిస్తున్న తరుణంలో 'అల్లరి' జరిగింది. భారత్ విజయం దాదాపు ఖాయమని తేలిన తర్వాత కూడా మ్యాచ్‌కు అంతరాయం కలగడాన్ని బట్టి చూస్తే ఇది ప్రేక్షకులు ఆవేశంతో చేసిన చర్య కాదనిపిస్తోంది. భారత్ విజయంవైపుకు దూసుకెళ్తున్న సమయంలో మ్యాచ్‌కు అంతరాయం కలిగించడానికి అవకాశం దొరకడం లేదని భావించిన 'అల్లరి ప్రేక్షకులకు' గంగూలి అవుటవడం సాకుగా దొరికింది. గంగూలి అవుటవడంతో ప్రేక్షకులు ఆందోళనకు, ఆవేశానికి లోనయ్యారనేందుకు అవకాశం లేదు. అవుటయ్యే సమయానికి 72 పరుగులు చేసిన గంగూలి భారత్‌ను విజయ బాటలో వదలి వెళ్లాడు. అందుకే ప్రేక్షకులు భారత్ గెలుపుపై ఆందోళన పడాల్సిన పరిస్థితే లేదు. అయినా అల్లరి ఆగలేదు. ఈ సంఘటనతో అల్లరి చేయడానికి ప్రత్యేకంగా కొంతమంది ముందే ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని అనుమానం కలుగుతోంది.

ఈ దుస్సంప్రదాయాన్ని ప్రారంభించిన శివసేన

భారత క్రికెట్‌లో హింసాత్మక ధోరణిని మహారాష్ట్ర ప్రాంతీయ పార్టీ అయిన శివసేన ఆరంభించింది. భారత్‌లో పాకిస్తాన్ క్రికెట్ జట్టు పర్యటనను వ్యతిరేకించిన శివసేన ముంబయిలోని వాంఖడే స్టేడియం, న్యూఢిల్లీలోని ఫిరోజ్‌షా కోట్లా మైదానాల్లో పిచ్‌లను తవ్వి హంగామా సృష్టించింది. క్రీడలను రాజకీయాలతో ముడిపెట్టరాదన్న సిద్ధాంతాన్ని మంటగలిపిన ఈ పార్టీ అధినేత బాల్‌థాకరే భారత్‌లో పాక్ జట్టు పర్యటనను బహిరంగంగానే వ్యతిరేకించాడు. అంతేకాక పిచ్‌లను ధ్వంసం చేయాలని కార్యకర్తలకు పిలుపు ఇచ్చాడు. అయినా అతనిపై ఎటువంటి చర్యా తీసుకోలేదు. కనీసం కేసుకూడా నమోదు చేయలేదు. ముంబయి, ఢిల్లీ పిచ్‌లను తవ్వినవారిపై కూడా కఠిన చర్యలు తీసుకోలేదు. దీంతో 'అల్లరి ప్రేక్షకులకు' ధైర్యం వచ్చింది. తాము ఏం చేసినా (స్టేడియంలో మ్యాచ్‌కు అంతరాయం కలిగించినా) ఎవరూ పట్టించుకోరనే ధీమాతో గలాభా సృష్టిస్తున్నారు. మత ఛాందసాన్ని తలకెక్కించుకుంటే జరిగే పరిణామాల్లో ఇది ఒక మచ్చుతునక మాత్రమే.

గతంలో....

ప్రేక్షకుల ఆగడాలకు పాకిస్తాన్ ప్రఖ్యాతి గాంచింది. తమ జట్టు ఓడిపోతుందని భావిస్తే పాక్ ప్రేక్షకులు గొడవ సృష్టించి ఆ మ్యాచ్‌ను రద్దు చేసేవరకూ విశ్రమించరు. ఆ దురదృష్టకర ఘటనలు భారత్‌లో కూడా అప్పుడప్పుడు జరిగాయి. భారత్-పాకిస్తాన్ సంయుక్తంగా ఆతిథ్యం ఇచ్చిన ప్రపంచకప్ టోర్నమెంట్ సెమీఫైనల్ మ్యాచ్ కూడా ప్రేక్షకుల గొడవ కారణంగా రద్దయింది. శ్రీలంకతో కొల్‌కతాలో జరిగిన ఆ మ్యాచ్‌లో భారత్ ఓటమి పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో ప్రేక్షకులు మైదానంలోకి ఖాళీ బాటిళ్లు, చెత్తా చెదారాన్ని విసిరారు. దీంతో ఆ మ్యాచ్‌ను రద్దుచేసిన నిర్వాహకులు లంకను విజేతగా ప్రకటించారు. తర్వాత అదే మైదానంలో పాకిస్తాన్‌తో జరిగిన ఒక టెస్ట్ మ్యాచ్ సందర్భంగా కూడా అల్లరి జరిగింది. సచిన్ టెండూల్కర్ రనౌట్ వివాదం రేపింది. సచిన్ పరుగు తీసే సమయంలో షోయబ్ అక్తర్ అతనికి అడ్డంగా వచ్చి రనౌట్‌కు కారకుడయ్యాడని ఆరోపిస్తూ ప్రేక్షకులు పెద్ద గొడవ సృష్టించారు. ఇటీవల పాకిస్తాన్‌లో పర్యటించడానికి ప్రపంచంలోని క్రికెట్ జట్లన్నీ నిరాకరించాయి. ఉగ్రవాద కార్యకలాపాల కారణంగా పాక్‌లో తమ జట్టుకు భద్రత కరువైందని భారత్‌తో పాటు న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్లు ప్రకటించాయి. న్యూజిలాండ్ జట్టు పాక్‌లో పర్యటిస్తున్న సమయంలో ఆ జట్టు బసచేసిన హోటల్ సమీపంలోనే ఉగ్రవాదులు బాంబు పేల్చడంతో భయకంపితులయ్యారు. వెంటనే కివీస్ జట్టు మూటాముల్లే సర్దుకొని స్వదేశం వెళ్లింది. ఆసీస్, విండీస్ జట్లు కూడా తమ పర్యటనలను రద్దుచేసుకున్నాయి. మతఛాందస పైత్యం తలకెక్కిన కొంతమంది కారణంగా పాక్ దేశానికే చెడ్డపేరు వచ్చింది.

గెలుపూఓటములతో నిమిత్తం లేకుండా క్రీడా స్ఫూర్తితో ఆటను తిలకించినప్పుడే ఇటువంటి సంఘటనలకు ఆస్కారం ఉండదు. ఏ జట్టు ఓడినా, గెల్చినా మంచి ఆటను ఆస్వాదించడమే క్రీడాభిమానుల, ప్రేక్షకుల అభిమతం కావాలి. అప్పుడే వారు తాత్కాలిక ఆవేశాలకు లోనుకాకుండా, గొడవలు సృష్టించకుండా ఉండగలరు. మరోవైపు మతఛాందసాన్ని, రాజకీయాలను క్రీడలకు ఆమడ దూరంలో ఉంచాలి. శివసేన వంటి మతతత్వ పార్టీలు ప్రజల్లో ఉన్న సెంటిమెంట్‌ను దెబ్బతీయడానికి క్రీడలను పావులుగా ఉపయోగించుకోవడాన్ని క్రీడాభిమానులంతా ముక్తకంఠంతో వ్యతిరేకించాలి. లేకుంటే కొంతమంది 'అల్లరి ప్రేక్షకుల' వల్ల వందలాది రూపాయలు వెచ్చించి టికెట్లు కొన్న వేలాది మంది అభిమానులు మ్యాచ్‌ను ఆస్వాదించే అవకాశాన్ని కోల్పోతారు. ★

తగువు

దర్శన్

కాళ్ళకు కిర్రు చెప్పులు, ఎండైనా, వానైనా. అవి ఉన్నా లేకున్నా చేతిలో గొడుగు, శుభ్రంగా ఉతికిన తెల్లని ధోవతీ, అంగీ. నోట్లో పొగాకు చుట్ట. వడివడిగా నడిచే తిరుపతి. అతడి ఆకారం, వేషం చూసి అతడ్ని ఆ ఊరి మోతుబరి అనుకుంటే పొరపాటే. అతడి నలుగురు కొడుకుల్లో ఇద్దరు మోతుబర్ల వద్ద వ్యవసాయంలో జీతముంటారు. అట్లా అని అతడు పొలం, చెలకా లేని వాడు కాదు. ఆ ఊళ్ళో పెద్ద రైతులు అతని కుటుంబీకులే. స్వయాన అతడి అన్నల కొడుకులే.

వాళ్ళ నాన్న నూట నలభై ఎకరాల రైతు. నలుగురు కొడుకుల్లో చిన్నవాడు ఈ తిరుపతి. తండ్రి ఊళ్ళో పెద్ద మనిషి. చిన్న చిన్న తగవులు విచారించి తీర్పులిస్తుండే వాడు. ముగ్గురు అన్నలు వ్యవసాయం చేస్తుంటే ఈ తిరుపతి ఎక్కడెక్కడో ఊళ్ళు

తిరుగుతుండేవాడు. పనిలో వొంగేవాడు కాదు. పనులున్నప్పుడు పారిపోయి అయిపోయాక వచ్చేవాడు. తండ్రి చనిపోయాక అన్నలు అతడికి భూమి పంచి ఇచ్చారు. నలభై ఎకరాల రైతును అని చెప్పుకుంటూండే పెద్దన్న కొడుకు రామన్న నూట నలభైల నాల్గో వంతు నలభై ఎట్లయితది సిన్నాయన అంటే 'నీకెరుక లేదు ఊరుకోరా. అది పాతకొలమానం. కొత్త కొలమానం ప్రకారం నలభై' అంటాడు. అతడి ప్రచారం వల్ల వాళ్ళంతా నలభై ఎకరాల ఆసాములయ్యారు. ఆ రామన్న ఈ చిన్నాయన కన్నా వయస్సులో పదేళ్ళు మాత్రమే చిన్న.

తిరుపతి తాతకట్టిన ఇల్లు శిథిలమైంది. అన్నలు ఇల్లు కట్టుకున్నారు. ఇతడికి ఇల్లు లేదు. ఇతడు ఊళ్ళో కాకుండా బావి గద్ద మీద నిట్టాడి గుడిసె వేసుకున్నాడు. తన ప్రియురాల్ని అందులో దిగబెట్టాడు. ఈ నిట్టాడి గుడిసెలో కొత్త ఆడమనిషిని చూసిన ఆ ముగ్గురు అన్నలు అవాక్కయ్యారు. పుట్టింట్ల వదిలేసిన తమ మరదల్ని, పిల్లల్ని తెచ్చుకుంటాడనుకుంటే ఈ కొత్త మనిషి ఏంది... అని విస్తుపోయారు.

అతడి చిన్నన్న మూడో నెంబరు తన ఇద్దరి అన్నల్ని గడ్డి వాములకు పిలిచాడు. ముగ్గురూ సమావేశమయ్యారు. తమ తమ్ముడి నిర్వాకం గురించి తీవ్ర చర్చ జరిగింది.

"పెద్దన్నా, సిన్నన్నా, ఈ తిర్పతిగాడు ఎవ్వత్తినో తీసుకొచ్చి మన కండ్ల ముందల ఉంచుతడా. దాని మొఖం జూస్కుంట మనం ఈ బావికాడ ఎట్ల మసలుకుంటం. ఈడ్ని జూశి మన పిల్లలు నేర్చుకుంటే మన కోడళ్ళ గతి ఏంకాను. మరదలు పిల్లని తెచ్చుకొని, పొలం శెల్క దున్నుకొని బాగుపడతడు గదా అనుకుంటిమి. ఈడిట్లా పోరంబోకు ఏశాలు పస్తడని కలగంటిమా.

'అన్నా మన తమ్ముడే ఇట్ల ఉంటె ఊళ్ళ నువ్విక ఆలుమగల పంచాదిలు ఏం చెప్తవ్' రెండు నెంబరు అభిప్రాయం చెప్పాడు.

"ముత్యం నువ్వు అడిగితే ఏమన్నాడురా" మూడో వాడ్ని అడిగాడు పెద్దన్న.

'అన్నల్ని అడిగే గుడిసె ఏసిన. ఈమె కూడా మీ మరదలే' అంటుండు.

ముగ్గురూ చర్చించుకొని ఓ నిర్ణయానికి వచ్చారు. 'భార్యా పిల్లల్ని తెచ్చుకుంటేనే భూమిల పాలు ఇచ్చేది. అప్పటిదాకా ఆడు ఈడ ఉండకూడదు. నాగలి కట్ట కూడదు." ఈ నిర్ణయం అతడికి తెలియచేసే బాధ్యత ముత్యంకు అప్పగించారు. పెద్దన్నల ఇద్దరి మీద గౌరవం ఉన్న తిరుపతి ప్రియురాల్ని ఎటో పంపించి వేశాడు. భార్యా పిల్లల్ని తెచ్చుకున్నాడు. వ్యవసాయం చేసుకొమ్మని పెద్దన్నలిద్దరూ ఎద్దుల్ని ఇస్తే చిన్నన్న లేగదూడని ఇచ్చాడు. అతడి పాలికొచ్చిన రెండు ఎద్దులకు అదనంగా.

తిరుపతి అరక కట్టాడు. అన్నలు సంతోషించారు.

తరిపొలం దున్ని నాటేశాడు. పదెకరాల చెల్కలో సజ్జలు, ఆముదాలు విత్తనాలు వేశాడు. తన అన్నలు ఇర్వై ఎకరాలకు పైన్నే విత్తనాలు వేసి మిగతాది పశువుల మేతకు బీడుగా వదిలారు. అతడి మొదటి సంతు కొడుకే. పదేళ్ళు రాగానే ఆ పసివాడ్ని బడికి పంపకుండా తన వెంట అరకకు ఆసరా చేసుకున్నాడు. రెండో వాడికి ఎనిమిదేళ్ళు. పశువుల్ని మేతకు తోలుకపోతాడు. వారిని చదివించే ఉద్దేశం అతడికి లేదు.

ఒక్కో కొడుకు ఎదిగి వస్తుంటే తాను ఒక్కో పని మానుకున్నాడు. పెద్దోడికి పదిహేనేళ్ళు రాగానే మొదటి అరక అతడిచే దున్నించాడు. రెండో అరక తప్పనిసరైతేనే తాను దున్నేవాడు. రెండో వాడికి పదిహేనేళ్ళు రాగానే వ్యవసాయం మానుకున్నాడు. కొడుకుల మీద పర్యవేక్షణే. వ్యాపారం చేస్తానని పొలంలో పండించిన కూరగాయల్ని తీసుకొని మండల కేంద్రం పోచంపల్లికి వెళ్ళేవాడు అమ్ముకొస్తానని. వస్తే సాయంకాలానికి వచ్చేవాడు. లేకుంటే రెండు మూడు రోజుల దాకా పత్తా ఉండే వాడు కాదు.

☆☆☆

తిరుపతి పెద్దన్న కొడుకు పేరు రామన్న. అతడి కొడుకులిద్దరూ తన చిన్న కొడుకులిద్దరికీ సమ వయస్కులు. వాళ్ళు బడికి వెళ్తున్నారు. రామన్న తనకు సహాయంగా వ్యవసాయంలో జీతగాడ్ని పెట్టుకున్నాడు. కాని తిరుపతి తన కొడుకుల్ని పసివాళ్ళని పసుల కాసేందుకు తోలుతున్నాడు.

తన భూమిలో తన తండ్రి కాలం నుంచి పెరిగిన చెట్లన్నీ కొట్టించాడు తన ఇద్దరు కొడుకులతో. అందుకు రామన్న తిట్టాడు. 'సెలుకుల సెట్లు లేకుండా పాడు జేస్తున్నావ్' అని. అతడు విన్పించుకోలే.

'నీకేం ఎరుకరా రామన్న అరక దున్నడం తప్ప. ఈ కట్టెల్ని పట్నం అమ్మితే మస్తు పైకం. సెట్లదేముంది. మళ్ళా పెరుగుతాయి" అన్నాడు. తనకు ఎడ్లబండి లేదు. తన అన్నల కొడుకులకు తలా ఓ బండి ఉంది. కిరాయికి మాట్లాడుకున్నాడు. మూడు ఒళ్ళ నిండా కట్టె నింపాడు. వాళ్ళ జీతగాండ్లు ఆ బండ్లను తోలారు. పట్నం బాట పట్టించాడు. మూడు రోజుల దాకా ఊరికి రాలేదు. అక్కడ జరిగిన విషయాల్ని ఆ జీతగాళ్ళు తమ పటేళ్ళ కొడుకులకు చెప్పారు.

ఆ మనవలు ఈ చిన్న తాతని ఆటపట్టిస్తుంటారు. అతడూ ఆ మనుమలతో బాగా పరాచికాలు ఆడుతుంటాడు. వాళ్ళు ఈ తాత లీలల్ని జోకులుగా ప్రచారం చేస్తుంటారు.

వారిది చిన్న పల్లెటూరు. తన ఊరిపేరు, పుట్టిన ఊరి పేరు చెప్పుకోవడానికి నామోషిగా భావిస్తాడు అతడు. కట్టెల అడ్డ కాడ ఊరుపేరు నమోదు చేయలేదు. మండల కేంద్రం, పెద్ద ఊరుపేరు చెప్పాడు. మదిర కింది తిరుపతి అని రాయించాడు. ఎవ్వరన్నా ఈ బండ్లు, కట్టె అని చెప్పమన్నాడు జీతగాళ్ళకు. ఊరిపేరు, ఇంటిపేరు హుష్. ఆ మండలంలో ఈయనేదో పాపులర్ అయినట్టు. ఆ మనవలు అప్పట్నుంచి అతడ్ని 'మదిర కింది తాతా' అని పిలవసాగారు. తమ ఊరి బళ్ళో నాల్గవ తరగతి

అయిపోగానే పై చదువులకు జూలూరు బడిలో చేరింతర్వాత తమ తాతకు మదిర కింది తిరుపతిగా చుట్టుపక్కల ఊళ్ళల్లో ఎంత పరపతో అర్థమైంది. ఎటొచ్చి తమ ఊళ్ళోనే అపరిచితం అని అర్థం చేసుకున్నారు. ఊరూరా అప్పులు చేసినందుకే అతడికంత పేరు వచ్చింది అని కూడా ఆ చిట్టి బుర్రలకు అర్థమైంది. అయితే తమ ఊళ్ళో అతడికెవ్వరూ ఒక్క రూపాయి కూడా అప్పు ఇవ్వరు.

ఓ సాయంకాలం ఊరి వెలుపల. తిరుపతి అతడి వెంట పక్క ఊరి పెద్ద రైతు నిల్చున్నాడు. "అదిగదిగో ఆ కన్పించే గుట్టదాక ఈడి నుంచి ఆ గుట్ట దాకా మరొకళ్ళ భూమి కాలు పెట్టకుండా ఏళ్ళొచ్చు. సొంతం మాదే. నూట అరవై ఎకరాలు" అంటూ తన చేతిని సాగదీసి చూపుడు వేలితో దూరాన ఉన్న కొండదాక తమదేనని చెప్పాడు.. మర్నాడు తన పెద్దన్న మనవడు, రామన్న కొడుకు అడగనే అడిగాడు.

"నీకున్నది ముప్పై ఎకరాలేగా తాతా! ఆ వొచ్చినాయన ఎవ్వరు. ఆయనతో ఆ గుట్టదాకా నూట అరవై ఎకరాలు సొంతం నీదే అని చెప్పినవ్" అని.

"నాది ముప్పై అయితే ఏంది వాయి. మా నాయనది నూట అరవై ఎకరాలేగా. మీరు సరిగ్గా ఇనలేదు. నాది అనలే మాది అన్నాను" ఆ తాత చమత్కారాన్ని మరో జోక్‌గా చేర్చుకున్నారు ఆ మనవలు.

ఆ తాత ఆ మనవళ్ళి ఎప్పుడూ విసుక్కోలేదు. కసురుకోలేదు. అట్లా అతడు ఎప్పుడూ చేయగా ఎరుగరు ఆ మనవళ్ళు. తమ నాన్నల కన్నా కూడా ఆ చిన్న తాత ఎంతో ఆప్యాయంగా పలుకరిస్తాడు.

ఆ పెద్ద రైతు వద్ద తన రెండో కొడుకుని జీతం ఉంచాడు. ఎదిగి వచ్చిన మూడో వాడ్ని పెద్ద కొడుక్కి ఆసరాగా ఉంచాడు.

"సొంత భూమిని సెల్కల్ని పడావ్ ఉంచి కొడుకుని జీతంల ఉంచి మన వంశం పరువు తీస్తున్నావు" రామన్న తిట్టాడు. "పెద్ద బిడ్డ పెండ్లి చేయాలె, అందుకు పైకం కావాలె. అప్పు కావాలె. అందుకని రెండోన్ని జీతముంచిన" సమర్థించుకున్నాడు.

"బిడ్డ పెండ్లికి అప్పు కావాలె. అందుకు జీతముంచిన అని సిగ్గు తప్పి మాట్లాడుతున్నవ్. సెల్కల సెట్టు. కొమ్మ అన్నీ అమ్మినవ్. అమ్మనిది అంటూ ఏదీ లేదు. ఆఖరికి ఊరికే తెచ్చుకొని తినే సీతాఫల కాయల్ని కూడా పోరగాళ్ళకు తింటందుకు లేకుండా జేసి పట్నంల అమ్ముకుంటివి. దమ్మిడి కష్టం జేయవు. ఊళ్ళు తిరగడమే నీకు పని అయిపోయింది. ఇన్ని బేరాలు జేసి ఇవన్నీ అమ్మిన పైసలు ఏమైనయి" రామన్న నిలవేసాడు.

"నీకేం ఖర్మందిరా ఎర్రి మాలోకమా. ఓ సుట్టా, బీడా. మొద్దు కష్టం జెయ్యడం ఒక్కటే తెలుసు. ప్రపంచం ఎట్లా మారుతుందో తెలుసా. ఉన్న ఊరిడిసిపోవు" మాటకారితనం కాకపోతే, అప్పుకు ప్రపంచం మార్పుకు సంబంధం అర్థం కాక అతడు మరో రెండు అంటిస్తాడు. అతడు దులిపేసుకుంటాడు. మరొకరి వద్ద చేసిన అప్పు కొద్ది నెల్లకు వడ్డీతో నాల్గు వేలు అయింది. అతడికి ఎకరం చెలక రాసిచ్చాడు.

ఎనిమిది మంది సంతానం లోంచి ముగ్గురి పెళ్ళిళ్ళు అయ్యాయి. ఇద్దరు కొడుకుల మీద ఇరవై వేలకు పైన్నే అప్పు ఉంది. షావుకారు వద్ద కూడా కొంత అప్పు ఉంది.

అప్పు చేసి మరో ఇద్దరు కొడుకుల పెళ్ళిళ్ళు చేశాడు. ఋణభారం పెరిగిపోయింది. అప్పిచ్చిన వ్యక్తి చెలకల్ని తనఖా రాయించుకొని మరీ ఇచ్చాడు. పదెకరాల చెల్క కబ్జా తీసుకొని తానే దున్నుకుంటున్నాడు. కౌలును వడ్డీలో జమ వేసుకుంటున్నాడు. కౌలు వడ్డీకి సరిపోదు.

☆ ☆ ☆

తిరుపతి తన ఇద్దరు కొడుకుల్ని జీతంల నుంచి తీశాడు. వాళ్ళని విడిపించుకోవడానికి అప్పు కింద పదెకరాల చెల్కని ధర కట్టి వదులుకున్నాడు. ముప్పై ఐదు ఎకరాల రైతు ఇరవై ఎకరాలకు దిగిపోయాడు. తన కొడుకులు నలుగురికి ఇరవై ఎకరాల్లో పని ఉంటదా. వానలు బాగా కురిస్తే ఆ కాలంలో ఉండొచ్చు. నాల్గు అరకలకు ఎనిమిది ఎద్దులు కావాలె. కాని ఆ నాలుగెద్దులే ఉన్నాయి. రెండు అరకలే కట్టగలదు. కుటుంబమంతా కలిసి బావి తవ్వారు. నలభై అడుగుల లోతులో కూడా నీళ్ళు రాలేదు. బండ వచ్చింది. కుటుంబ సభ్యుల శ్రమే కాబట్టి ఆర్థిక నష్టం జరగలేదు. పనిముట్లు తిరిగి అమ్మేశాడు.

ఒక ఆర్నెల్లు ఆగాడు. ఇద్దర్ని జీతంల ఉంచాలనుకున్నాడు. రెండోడు, మూడోడు సత్యం, యాదగిరిలను సొంత వ్యవసాయంలో ఉంచాడు. పెద్దోడు, చిన్నోడు మల్లన్న, లచ్చన్నలను జీతంల ఉంచాలనుకున్నాడు. మల్లన్నని కాల్వ కింద రైతు వద్ద ఉంచాడు. లచ్చన్నని పట్నం దగ్గరి ఊళ్ళో కోళ్ళ ఫారంల ఉంచాడు. అన్నం యజమానిదే. నగదు ఇచ్చే జీతం. ఆర్నెల్లు అడ్వాన్సు తెచ్చుకున్నాడు.

☆ ☆ ☆

తిరుపతి జీవన్నాటకంలో మరో అంకం చేరింది.

చిన్న కొడుకు లచ్చయ్య జీతమున్న చోటుకు తరచూ వెళ్తూ ఆ యజమానితో బాగా సాన్నిహిత్యం పెంచుకున్నాడు.

ఆ యజమాని కూతురు కొంచెం అనాకారి. పెళ్ళి సంబంధం కుదురుత లేదు. తిరుపతి ఎరుకల ఏదన్నా సంబంధముంటే చెప్పమన్నాడు. ఈ పట్నం వాసన ఉన్న పిల్లకు తమ పల్లెటూళ్ళ సంబంధం చూడమంటూంటే తప్పకుండా ఏదో లోపముంటుంది అని ఊహించాడు. ఎవ్వరికో ఎందుకు తన కొడుక్కే ఇచ్చేట్లు చేస్తే కట్నం కింద దబ్బు గుంజొచ్చు. అప్పులు తీర్చుకోవచ్చు. ఆ కోడలు పిల్ల ఎట్లాగు తమ కుటుంబంలో ఇమడ లేదు. కాబట్టి వచ్చి ఇక్కడ కాపురం పెడ్తది. అప్పుడు తన కొడుకు ఒక్కడైనా సిరిమంతుల ఇంట్ల కలిసిపోతాడు. అత్తవారే ఇంత భూమో లేదా కోళ్ళ ఫారానికి పెట్టుబడి పెట్టొచ్చు అని కలలు కన్నాడు. అందుకు చిట్కాలు వేశాడు.

అతడు చెప్పిన మాయ మాటలు బాగానే ప్రభావం చూపాయి. ఊరు, అతడి భూమి, ఇల్లు చూస్తామన్నారు. తిరుపతి భార్య తన కొడుక్కి సిరిమంతుల పెళ్ళి చూపులు అని హడావిడి చేసింది.

సందు గొందుల నుంచి ఓ కారు వచ్చి వారి ఇంటి ముందు ఆగింది. అరవై దాటిన ఓ పెద్ద మనిషి, అరవైకి చేరువలో ఉన్న ఓ స్త్రీ, ముప్పై అయిదేళ్ళ ఓ యువకుడు ఆ కారులోంచి దిగారు. తిరుపతికి అప్పు ఈయడానికో, వసూలు చేసుకోడానికో అని ఊహించేట్లుగా లేదు చుట్టుపక్కల వాళ్ళకు. కారులోంచి దిగిన వాళ్ళకు తిరుపతికి తాతల నాటిది మట్టిమిద్దో, చవుడు మిద్దో ఉంటుందన్న ఊహకు భిన్నంగా కొత్త పెంకుల్తో కొత్తగా ఉన్న నాలుగ్గదుల మట్టి ఇంటిని చూసి వాకిట్లోనే నిరాశ చెందారు. వాకిలి వంకా, ఇంటివంకా తేరి పార చూసిన ఆ పెద్ద మనిషి తన కొడుక్కి ఏదో ఇసారా చేశాడు. ఆ యువకుడు ఆ ఇంట్లోకి తన తల్లీ, తండ్రితో అనుసరించకుండా పక్క సందులోకి నిష్క్రమించాడు. తన పాచిక పారదేమోనని తిరుపతి కీడు శంకిస్తూనే ఉన్నాడు. అయినా చేయగలిగింది కూడా ఏమీ లేదు.

కాసేపటికే అతడు తిరిగి వచ్చి వాకిట్లోంచి తల్లినీ, తండ్రినీ సైగ చేసి పిలుచుకొని కారెక్కి వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిపోగానే తమ దరిద్రం కొంపలోకి లక్ష్మి రాకుండా పాయె అని చిన్న పిల్లల్ని గుద్దులు గుద్దింది తిరుపతి భార్య. కుటుంబం యావత్తు నిజం చెప్పిన తన దాయాది మీదికి దండెత్తారు. అట్లా రావచ్చును అని ఊహించిన ఆమె అందుకు సిద్ధమై ఉంది. ఆమె ఎదురు దాడికి ఉపక్రమించేసరికి గొడవ పెద్దగయితే తన మోసకారితనం ఊరంతా పాకుతుందనే భయంతో తన దండును ఉపసంహరింప చేశాడు తిరుపతి.

మరో రుణదాత ఒకరోజు ఈ పల్లెకు వొచ్చాడు. యాదృచ్ఛికంగా తిరుపతికి మిగిలి ఉన్న పదిహేను ఎకరాల సెలకని చూశాడు. ఎడ్ల బళ్ళు వెళ్ళే దారి పక్కగా ఉంది. ఈ బండ్ల బాటని రోడ్డుగా మార్చేందుకు సర్వే జరిగిందని సర్వేయర్ చెప్పగా విన్నాడు. రోడ్డు వేస్తే ఆ చెల్కల కోళ్ళఫారం, డైరీ పెట్టుకోవడానికి అనువుగా ఉంటుంది. భూమి ధర కూడా పెరుగుతుంది. మనస్సులోనే పథకం అల్లుకున్నాడు. వేసవి, ఉగాది పండుగ వచ్చింది. ఉగాదికి జీతగాళ్ళు మారే కాలం.

తీసుకున్న అప్పు మధ్యమధ్యన తీసుకున్న అడ్వాన్సు వడ్డీతో సహా ఇరవై వేలు అయింది. కట్టమని ఒత్తిడి తెచ్చాడు. కొడుకుని జీతం ఉంచుకునేది లేదన్నాడు. ఆ కొడుకుని మరొకరి వద్ద ఉంచబోతే అప్పు పదివేలే ఇస్తామన్నారు. మరొక కొడుకు మీద అప్పు ఉండనే ఉంది. చేసేది లేక తిరుపతి భూమి బేరం పెట్టాడు. ఆ చెలకలో పండేది వడ్డీకి సరిపోదు. కాబట్టి అమ్మడమే ఉత్తమం అనుకున్నాడు. ఎకరం నాలుగు వేల చొప్పున పదెకరాలకు తన అప్పు ఇరవై వేలు పోను ఇరవై వేలు ఇచ్చి పదెకరాలు పట్టా చేయించుకున్నాడు ఆ ఆసామి. తిరుపతికి మిగిలింది రెండెకరాల తరి. నాలుగు ఎకరాల చెలక. ఆ చెలక పసులు తిరగడానికి గడ్డికి సరిపోతోంది. తరి పొలం దున్నడానికి ఒక అరక చాలు. అందుకు రెండు ఎద్దులు ఉంచుకొని మిగిలిన రెండు ఎద్దుల్ని అమ్మి నగదు చేసుకున్నాడు. పాడికి రెండు బర్రెల్ని కొందామనుకున్నాడు. కాని డబ్బులు చిల్లర బాకీలు తీర్చడానికి అయిపోయాయి. ఒక్క బర్రెనే కొన్నాడు. భూమి అమ్మగా వచ్చిన మిగిలిన పైకంతో మూడో కూతురి పెళ్ళి చేశాడు.

☆ ☆ ☆

నిరంతర రుణాన్వేషి తిరుపతి. కొత్త కొత్త

(మిగతా 23వ పేజీలో)

ప్రజా ఉద్యమ నిర్మాణంలో అనుభవాలు - జ్ఞాపకాలు

'ఎల్‌బిజి'గా ఆంధ్ర రాజకీయ జీవితంలో అందరికీ పరిచయంగా వున్న లావు బాలగంగాధరరావు గారి మాటలు ఈ అనుభవాలు - జ్ఞాపకాలు. అనారోగ్యంగా వుండి ఎంతో ప్రయాసతో చెప్పిన ఆయన మాటలను, అంతకుమించిన ప్రయాసతో విని, సూచించిన పుస్తకాలను చదివి, అక్షర రూపంలో అందించింది వాసిరెడ్డిగారు. దానికి "కలం చిత్రణ" అని కొత్త పేరు పెట్టారు. విషయంలోని గంభీరత, నిండుగోదారిలా చిత్రించారు వాసిరెడ్డిగారు.

నేడు మనం రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలలో అపూర్వమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాం. న్యాయ వ్యవస్థ నుండి కళా రంగాల వరకు ఆయా రంగాలలో నిష్ణాతులుగా నిన్నటితరం ప్రతిభావంతులు పాత విలువలు కుప్పకూలిపోతున్నాయని వాపోవడం వినడం, కనడం సర్వసాధారణమైపోయింది. విలువలు ఎప్పుడూ మారుతూ ఉంటాయి. మారే విలువలు మానవ జీవితాన్ని అన్ని రంగాలలో సృజనాత్మకంగా పురోగమించేందుకు తోడ్పడితే ప్రజాభిప్రాయం ఆహ్వానిస్తుంది. కాని మనుషుల మధ్య అంతరాలు, దాని ఫలితంగా వైషమ్యాలకు ఆ మార్పులు కారణమైనప్పుడే వాటిని ద్వేషించేంత ఘోషగా తయారవుతుంది. మూలం తెలిస్తే అదే ఘోష, తిరుగుబాటుగా మారుతుంది. మనం ఆ సంధి యుగంలో వున్నాం. సంధికాలం ముగిసి మరొక ఆదర్శవంతమైన సామాజిక ధర్మం - ప్రగతి శీలమైన - సామాజిక రూపంలో కావాలనే ఆకాంక్షకు దర్పణం ఈ సంకలనం.

దేశం స్వాతంత్ర్యం సాధించుకొనడంలో పాత్ర వహించిన వారు, ఆ ఫలితాలు కష్ట జీవులకు అందించాలని పడిన కష్టాలు, చేసిన త్యాగాలు, పట్టిన ఆయుధాలు, సాధించిన విజయాలు, ఎదురైన పరాజయాలు కర్తవ్య నిర్వహణకు తీసుకోవాల్సిన పాఠాల కలబోతగా ఈ జ్ఞాపకాలు సాగాయి.

కష్ట జీవులకు ఫలితాలు అందని స్వాతంత్ర్యం మొదటి రోజు నుండే ఘర్షణల వేదిక అయింది. అధికారం పొందిన వర్గాలు, దేశాన్నే స్వంతం చేసుకునే ప్రయత్నంలో ప్రజా జీవితానికి సంక్షోభాన్ని సృష్టించారు. ఆ సంక్షోభం ఈ పాలనకు మూలమైన సిద్ధాంత పునాదినే తినేసింది. 'కీన్స్' ఆర్థిక సిద్ధాంతం అమలు చేసి, పురోగమనం సాధించాలనే దారి పాలకుల సొంత లాభాన్ని కాపాడే కంచె కాదని నిర్ణయించుకున్నారు. "వాషింగ్టన్ కాన్‌సెన్"లో భాగస్వాములై చేజిక్కింది దక్కించుకోవాలని దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుంటున్నారు. కూలిపోయిన వారి సిద్ధాంత పునాది లౌకికతత్వాన్ని కూడా కాపాడలేనంత బలహీనపడింది. మతమౌఢ్యం సాధనంగా దేశాన్ని చిన్నాభిన్నం చేసైనా, ప్రజాసంపదను వీలైనంత త్వరగా దోచి, దాచుకోవాలనే పోటీగానే పాలకవర్గాల రాజకీయాలు దిగజారిపోయాయి. అలీన విధానం అంటే అమెరికా అడుగులకు మడుగులొత్తే బానిస భావంగా మార్చబడింది.

సామ్రాజ్యవాద వ్యతిరేకత, లౌకికతత్వం, సమసమాజ సాధన అనే మూడూ కలిసి ముప్పేట బంధంగా ఆవిష్కరించే క్రమం ప్రారంభమైన సంధియుగం ఇది.

అదృష్టవశాత్తూ ఈ సంధికాలంలో ప్రగతిశీలంగా దేశాన్ని నడపాలనే ఆదర్శానికి యువతరం ఆకర్షింపబడుతోంది. అలాంటి మహా యజ్ఞానికి లక్షలాది ప్రజల మద్దతు వుంది. అది ప్రతినిత్యం పెరుగుతోంది. కూలిపోతున్న పాత విలువల పట్ల ఆవేదన, నూతన సమాజపు ఆకాంక్షగా మారక తప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అదొక మహా ప్రవాహం అయితీరుతుంది.



లావు బాలగంగాధరరావు
అనుభవాలు - జ్ఞాపకాలు
కలంచిత్రణ : వాసిరెడ్డి సత్యనారాయణ
వెల : రు. 30, ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

మార్పుకు తయారవుతున్న ఈనాటి సమాజానికి, మార్పు ఆకాంక్షతో ఆరు దశాబ్దాలపైగా విరామ మెరుగని శ్రామికునిగా వుండిన 'ఎల్‌బిజి' అనుభవాలు 'కోడ్ ఆఫ్ కాండక్ట్' నియమాలను అందిస్తాయి.

పోరాట సమయంలో సైతం రాజకీయాలు, రాజకీయ నాయకత్వం అవసరాన్ని (పేజి 37) భిన్నాభిప్రాయం గలవారిపట్ల అనుసరించాల్సిన వైఖరి (పేజి 38) "పుట్టుకతోనే ఎవరూ వీరులు కారు. జీవితంలో అనుభవించిన కష్టాలు, ఎదురైన అనుభవాల వల్లనే వీరులుగా రూపొందుతారు. ప్రజలే పోరాట రూపాలను దిద్దుకుంటారు (42)" పోరాటాన్ని నాయకత్వం పార్టీ కార్యకర్తలు, ప్రజలకు, వారి చైతన్యానికి, నిర్మాణ పటిమకూ మరీ అందుకోలేనంత ముందుండ కూడదు (45)" స్వంతలాభం చూచుకోవడమే ప్రధానం అనుకున్న వారు కమ్యూనిస్టు నాయకులుగా కొనసాగలేరు (52). కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మార్గమే ఉత్తమ మార్గం అనే గుర్తింపు పొందిన తర్వాత పార్టీ పుంజుకోనారంభించింది (55). సిద్ధాంత నిబద్ధత (55). ఆయా పెడధోరణులకు తప్ప వ్యక్తులకు వ్యతిరేకంగా ఉండడం తప్పు (57). కమ్యూనిస్టులు ఆశయాలు, ఆదర్శాలతో పాటు ఆచరణలోనూ ఇతరులకు ఆదర్శంగా వుండాలి (58).

ఇలా నాయకత్వంలో వుండే వారికి సూక్తులు మార్క్సిస్టు పార్టీ విశిష్టతకు తోడ్పడిన అంశాలు. ఆ అంశాలే ఆచరణయుతమైన రాజకీయం అనే విశ్వాసం కలిగించేందుకు, ప్రమాణాలతో కూడిన పార్టీ నిర్మాణం ఈ పుస్తకం ఉద్దేశం.

గ్రామాలలో వ్యవసాయ కార్మికులను, కాలేజీలో విద్యార్థులను సమీకరించి కార్యకర్తలను తయారు చేయడం నుండి అఖిల భారత స్థాయిలో పార్టీ విధానాలకు సారథ్యం వహించేవరకు ఆయన అనుభవం వుంది. ఈ కాలంలో వచ్చిన సాంఘిక మార్పులు, రాజకీయాలపై వాటి ప్రభావం వంటి లోతైన విశ్లేషణకు ఆ పరిమితులలో చెప్పిన జ్ఞాపకాలలో స్థానం ఆశించలేము. కాని అలాంటి విశ్లేషణ కూడా తోడ్పడేది గదా!

అలాగే రాష్ట్రంలో సాగిన నందికొండ, రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం, భూపోరాటాలు, అంతకన్నా మించి రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిన 1980ల రైతాంగ పోరాటం, రాష్ట్రంలో జరిగిన సారా ఉద్యమం వంటివి కూడా ఇందులో చోటు చేసుకొని వుండాల్సింది.

పాతతరానికి, కొత్త తరానికి అనేక కారణాలతో వారధి ఏర్పడలేదు. కొన్ని తీగలే ఈ రెంటినీ కలుపుతున్నాయి. ఆ తీగలూ కాలం చెల్లుతున్నాయి. అలాంటి తీగలలో 'ఎల్‌బిజి' ఒకరు. ఆయన గతం నుండి భవిష్యత్‌కు ఒక బ్రిడ్జి కట్టే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నం వాసిరెడ్డిగారి కలం చక్కగా అమర్చింది.

రచయిత ఉద్దేశించిన పరిమితులలో చూస్తే ఈ చిన్న పుస్తకం తన ఉద్దేశాలకు సంపూర్ణ న్యాయం చేసింది.

ఆదర్శాలు రాజకీయాలకు ఆధారం కావాలి - అని కోరే వారంతా చదవదగిన, చదవాల్సిన అనుభవాలు ఇవి.

- వి. శ్రీహరి

లేనప్పుడు బీమా కంపెనీ బాధ్యత ఎంత మాత్రం ఉండదని బీమా కంపెనీ లాయర్ హైకోర్టులో వాదించారు. శ్రీనివాస్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా లారీని నడిపేందుకు అనుమతించిన లారీ యజమాని పూర్తి పరిహారం చెల్లించాలని ఆయన అన్నారు.

హైకోర్టు మోటారు వాహనాల చట్టాన్ని పరిశీలించింది. సెక్షన్ 140 ప్రకారం ఎవరి తప్పు లేకున్నా రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణిస్తే అతని కుటుంబానికి రు. 50 వేలు చెల్లించాలని గురువయ్య తరఫున కేసు వాదించిన లాయర్ హైకోర్టు ముందు వాదించారు. ఈ కేసులో కూడా ఈ సూత్రాన్ని పాటించాలని అన్నారు. రోడ్డు ప్రమాదం జరిగితే చాలు. అది ఎవరి కారణంగా జరిగింది? ఎవరు బాధ్యులు? డ్రైవర్‌కు లైసెన్స్ ఉందా? లేదా ? అన్నవి చూడనవసరం లేదు. ఈ కేసులో మోటారు వాహనాన్ని ఉపయోగించటం వల్లనే ప్రమాదం జరిగిందని రుజువైంది. చట్ట ప్రకారం ఈ ఒక్క విషయం చాలు. మోటారు వాహనాన్ని రోడ్డు మీద ఉపయోగిస్తుండగా ప్రమాదం జరిగి, వ్యక్తి మరణిస్తే సెక్షన్ 140 ప్రకారం బీమా కంపెనీ రు. 50 వేలకు తక్కువ కాకుండా పరిహారం చెల్లించవలసిన బాధ్యత ఉంది. మిగతా సొమ్మును యజమాని చెల్లించాలి. బీమా కంపెనీ 50 వేలు చెల్లించాలని హైకోర్టు తీర్పు చెప్పింది.

డ్రైవింగ్ లైసెన్స్ లేని డ్రైవర్ వాహనాన్ని నడిపినప్పుడు సెక్షన్ 140 కింద కూడా నష్టపరిహారం ఇవ్వకూడదని వాదించటం సరికాదని హైకోర్టు తీర్పు చెబుతూ బీమా కంపెనీ దాఖలు చేసిన అప్పీలును కొట్టివేసింది. ★

తరుగు

(19వ పేజీ తరువాయి)

రుణదాతల కోసం వెతుకుతూనే ఉంటాడు. పట్నంలో పాతచుట్టం చిరునామా దొరకబట్టాడు. తన తాతకు మేనల్లుడి కొడుకు. అతడికి మాయమాటలు చెప్పి పదివేల అప్పు పుట్టించుకున్నాడు. ఆ అప్పు తీర్చేందుకు షావుకారుకు ధాన్యం అమ్మాడు. దాంతో తిండి గింజల కోసం షావుకారు వద్దకు పోక తప్పలేదు. అతడు అరువుకు తిండిగింజలు ఇచ్చి ఖాతా రాసుకొని సంతకం పెట్టించుకున్నాడు. తిరుపతికి మిగిలి వున్న రెండెకరాల తరి పొలం మీద షావుకారు కన్ను పడింది.

కళ్ళంలో పంట. పచ్చి ధాన్యం. కుండతో కొలిచి తోలుకెళ్తున్నాడు షావుకారు. అప్పు చెల్లు వేసుకుంటానన్నాడు. మళ్ళీ అరువు ఖాతా మీద తిండిగింజలు ఇస్తున్నాడు. తిరుపతికి అమ్మినప్పుడు తరుగు. కొన్నప్పుడు తరుగు. షావుకారు వద్ద అప్పు పేరుకుపోయింది. వడ్డీతో రాసి పెరిగింది.

☆ ☆ ☆

అప్పు తీర్చమని తిరుపతిని బాగా ఒత్తిడి చేస్తున్నాడు షావుకారు. అతడి పొలం అమ్మించి కొనాలనే ఆదుర్దా అతడిది. ఇద్దరు కొడుకులు జీతంలో ఉన్నారు. పెద్దవాడు పల్లన్న వ్యవసాయంలో ఉన్నాడు. చిన్నోడు లచ్చన్న తండ్రి కుదిర్చిన జీతంతో ఉండే ఇష్టం లేక ఎటో వెళ్ళిపోయాడు. అతడి పెళ్ళి చేయాల్సి ఉంది. ఆడపిల్లల పెళ్ళిళ్ళు అయిపోయాయి.

వారందరివీ కూలి బతుకులే. పాలివాళ్ళకు ఈ తిరుపతిది

తమ వంశమే అని చెప్పుకోవడానికి నామోషిగా భావిస్తున్నారు.

భూమి మొత్తం అమ్ముదుపోతే తమ నెత్తిమీద ఉన్న అప్పు తీరి తాము విముక్తం అయ్యేది ఎట్ల అని తండ్రితో పోరు మొదలు పెట్టారు సత్య, యాదగిరి.

తమ మిగిలి వున్న పొలం, చెల్క మొత్తంగా అమ్మదల్చుకున్నాడు తిరుపతి. అమ్మేశాడు. షావుకారు అప్పు తీరగా, కొడుకుల మీద ఉన్న అప్పులు తీర్చి జీతంలోంచి తీశాడు ఆ ఇద్దర్నీ. తన నాలుగు అర్రల ఇల్లు ఎవ్వరికీ పంచి ఇవ్వలేదు. ఆ కొడుకులు ఆ ఊళ్ళో ఉండటానికి ఇష్టంగా లేరు. అందుకని ఇల్లు కూడా అమ్మివేశాడు. ఆ పైకం చిన్న కొడుకు పెళ్ళి కోసం షావుకారి వద్ద దాచాడు. నెల రోజులకు ఖర్చులకు గాను ఒక్కో కొడుక్కి వెయ్యి రూపాయలిచ్చాడు.

''సేతనయిన వాళ్ళు కష్టపడి బతుకుండ్రి. ముసలోడ్ని నాకు సేతగాదు. అందుకని నేను కొంత రొక్కం ఉంచుకుంటున్నాను అన్నాడు. అదెంతో వారికి చెప్పలేదు.

బతకడానికి వారంతా వలస వెళ్ళారు. పెద్దవాడు కాల్వ కింది ఊరికి వెళ్ళాడు. రెండో వాడు తన అత్తవారింటికి వెళ్ళాడు. మూడో అతను సద్దుగుడి ఊరికెళ్ళాడు. తిరుపతి తన ముసలమ్మతో వెళ్ళి తన కూతురు వద్ద ఉండాలనుకున్నాడు. తనతో ఉంచుకున్న డబ్బుని పెట్టుబడిగా కూరగాయల చిల్లర దుకాణం పెట్టుకునే ఆలోచనతో తాను పుట్టి పెరిగిన ఊరు విడిచాడు.

పోయేటప్పుడు తన పెద్దన్న కొడుకు రామన్నని కలిశాడు.

'పెద్దోడా, సిన్న తమ్ముడు వస్తే అతడి పెళ్ళికని డబ్బు షావుకారు వద్ద నీ సమక్షంలోనే పెట్టాను గదా, వొస్తే ఆ సంగతి చెప్పు. నాకు సెప్పంపు" అన్నాడు.

ఎన్నడూ స్థిమితంగా లేవు. ఊళ్ళు పట్టుక తిరిగావు. వొచ్చావు. భూమి పంచుకున్నావు. అంతా కరగ నాకావు. కొడుకులకు గంటెడు భూమి మిగల్చలేదు. నిన్ను మంచోడవు అని ఎవ్వరూ అనరు. నేను సెడ్డోడవు అని కూడా అనలేను. ఎందుకంటే నువ్వు చేసిన దుర్మార్గం ఏంలేదు. కడుపున వుట్టిన బిడ్డల్ని కాయకష్టం సేయించినవ్. జీతాలుంచినవ్. కూలి బతుకుల్ని సేసినవ్. నువ్వు మాత్రం దిలాసాగా తిరిగినవ్. పెద్దలిచ్చిన ఆస్థికరగనాకి కొడుకులకు ఏమీ మిగల్చని వాడిగా గుర్తుంటవు' అన్నాడు రామన్న

''నా గురించి అంత బాదొద్దు. పెద్దోడా నువ్వు గుండెల మీద సెయ్యేసి సెప్పు మనూళ్ళ మూడు వూటలా కడువునిండ అన్నం తింటున్నరు. నా బిడ్డలకు నేను మూడు పూటలా కడుపునిండా అన్నం బెట్టిన. ఆళ్ళు పరాయి పంచన కష్టం జేసినా నేను కడుపు మాడ్చలేదు. ఆళ్ళ కష్టం ఆళ్ళ తిండికి సాలలేదు. తరుగొచ్చింది. ఆ తరుగు కింద నా భూమి కరిగిపోయింది. కష్టపడుతున్నావురా బిడ్డా. కండలు కరిగిపోతున్నాయి. కొడుకుల్ని సదివిస్తున్నవు. నీ ఒంటికి కండ లేదు..." అన్నాడు తిరుపతి.

అతడి తీరుకు రామన్న విస్తుపోయాడు.

★

కులాతీత వివాహవేదిక

వధువు కావలెను



✡ 33/5'.3"/ 7 లక్షల ఆస్తి గల వరునికి ట్రాన్సఫర్‌బుల్ జాబ్ హోల్డర్ అయిన వధువు కావలెను. వికలాంగులు, విడాకులు పొందిన వారు, వితంతువులు కూడా సంప్రదించవచ్చు. బాక్స్ నెం : **221**, కేరాఫ్ ప్రజాశక్తి.

✡ 43/5'.4"/వివాహమై పిల్లలు లేని వరునికి వధువు కావలెను. విడాకులు పొందిన, వితంతువులైన వారు కూడా సంప్రదించవచ్చు. పిల్లలున్నా ఫర్వాలేదు. బాక్స్ నెం : **222**, కేరాఫ్ ప్రజాశక్తి.

✡ విడాకులు పొందిన బి.ఎస్‌సి., బిఇడి. చదివి ఇ.జి. సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్న వరునికి ఉన్నత విద్య, అభ్యుదయ భావాలు కలిగిన వధువు కావలెను. బాక్స్ నెం : **223**, కేరాఫ్ ప్రజాశక్తి.

అన్ని అనర్థాలకు...

కొండబాబు

"పెద్ద కోడలు వచ్చింది... కుటుంబాన్ని చీల్చింది... రెండో ఆవిడ వచ్చింది... ఆస్తులు పంచాలని కూర్చుంది... ఈ ఇల్లు నాలుగు కాలాలు కలిసి ఉండాలనుకున్నాను.. అట్లా కుదిరేలా లేదు..." కళ్ళొత్తుకుంటూ చెప్పింది సూర్యాకాంతమ్మ.

"ఇంటికి మంచి జరగాలన్నా... చెడు జరగాలన్నా ఆడదే కారణం..." ఆ రోజే వచ్చిన పెద్ద కూతురు జమున అంది.

"ఇంట్లో ఒక్క పనీ సరిగ్గా జరగడం లేదు.. వంతులు వేసుకుని ఎవరూ పొలం వెళ్ళడం లేదు... వంటా సరిగ్గా చేయడం లేదు.. ఈ సమస్యలతో అన్నదమ్ములకూ ఒకరంటే ఒకరికి పడటం లేదు" మళ్ళీ కళ్ళొత్తుకుందామె.

"వీటన్నింటికీ కారణం ఆ ఆడవాళ్లే" నొక్కి చెప్పారెవరో..

– ఒక సినిమాలోని సీనిది.

★ ★ ★

"చరిత్రలో యుద్ధాలు రావడానికి గానీ, మన దేశంలో ప్రభుత్వాలు పడిపోవడానికి గానీ ఆడదేరా కారణం... ఆడదాన్ని తక్కువ అంచనా వేయకు.." అన్నాడు ఓంకార్.

తన బాస్ ఇంకా ఏం చెబుతాడో అని చూస్తున్నాడు జగ్గు.

"నాయకురాలు నాగమ్మ నుంచి... ఎన్టీఆర్ ప్రభుత్వం పడిపోయిన దాకా, అదేరా జరిగింది. అంతెందుకూ... కేంద్ర ప్రభుత్వాలను కూల్చిందీ.. నిలిపిందీ ఆడది కదరా!" అన్నాడు ఓంకార్ జ్ఞానోపదేశం చేస్తూ.

– టీవీ సీరియల్ సన్నివేశమిది.

★ ★ ★

ఇళ్లల్లోనూ అంటుంటారు 'ఆ కుటుంబం అలా అవడానికి ఆ ఇంటికొచ్చిన కోడలే కారణం' అంటూ. 'కొడుకు మన వాడైనా కోడలు మనదవుతుందా!' అని కూడా అంటుంటారు. వీధుల్లోను రాజకీయాల గురించీ... ఇంకా ఇతరత్రా సామాజిక సంఘటనల గురించీ చర్చించేప్పుడు "ఆడదాన్ని నమ్మితే అంతేరా... ఆడదాని వల్లే ఏ అనర్థం జరిగినా!" అని.

అంతేకాదు మూడేళ్ళ క్రితం ఒక పత్రిక పెద్ద వ్యాసమే రాసింది రాజకీయ చిత్రపటంలోని పరిస్థితి గురించి చర్చిస్తూ "ఆ ముగ్గురు స్త్రీలు..." అంటూ. ఆయా పార్టీల రాజకీయ విధానాలను కాకుండా స్త్రీలైనందునే మొత్తం ఆ పరిస్థితికి కారణమవుతున్నట్లు ఉల్లేఖించారందులో.

ఇదేదో నిన్న, ఈ రోజు సినిమాలు, సీరియల్స్, పత్రికల్లో వస్తున్నవే కాదు. పూర్వం నుంచీ 'అన్ని అనర్థాలకూ స్త్రీలే కారణమ'నే, వ్యాఖ్యానం వినిపిస్తూనే ఉంది. మనుధర్మ శాస్త్రంలో స్త్రీలు ఏ విధంగా చెడుచేస్తారో శ్లోకాల కొద్దీ పేర్కొన్నారు. ఆ శ్లోకాలు... వ్యాఖ్యానాలుగా, వ్యాఖ్యానాలు భావాలుగా నేటికీ పాతుకుపోయి స్త్రీని అదే దృష్టితో చూసే పరిస్థితి స్థిరపడి ఉంది.



'అన్ని అర్థాలకూ మూలం స్త్రీయే'నే వ్యాఖ్యానాన్ని సోదాహరణంగా చెప్పే వారు అందులో ఉపరితల పాత్రలను, ఆ పాత్రలను తాము చెప్పాలనుకున్న అంశానికి బలపరుస్తూ చూపిస్తున్నారు తప్ప మరేమీ కాదు.

వాస్తవంగా... ఆర్థికంగా వనరులు ఎవరి చేతిలో ఉంటే వారే దేనినైనా ప్రభావితం చేస్తారు. ఈ సమాజంలో వనరులు పురుషుడి చేతిలో ఉన్నాయి. కాబట్టి అతని అభీష్టం మేరకే జరుగుతుంది. మరి ఉదాహరణల్లో కనిపిస్తున్న స్త్రీ పాత్రల పాత్రేమిటి? అనేది ప్రశ్న.

స్త్రీని విలాస వస్తువుగా, ఆస్తిగా భావించిన పురుషులే స్త్రీల కోసం యుద్ధాలు చేశారు. హత్యలు చేస్తున్నారు. వారి ఇష్టాయిష్టాలను బట్టే ఈ ఆస్తి (?) కావాలో, అధికారాలు, ప్రభుత్వాలు కావాలో నిర్ణయించుకుంటారు. ఆ మేరకే చేశారు, చేస్తున్నారు.. ఇక్కడ స్త్రీల పరిస్థితికి సానుభూతి చూపాలి తప్ప జరిగిన దానికి అనర్థంగా.. ఆయా స్త్రీలను కారకులుగా చూడడం సరైంది కాదు. ఇళ్ళల్లోనూ అంతే. కోడలు వచ్చాక వాళ్ళే అన్నీ ప్రభావితం చేస్తారనుకోవడం, విడిపోవడమనే అనర్థానికి కారణమవుతున్నారనుకోవడమూ కరెక్ట్ కాదు.

ఏ పురుషుడూ ఎవరు తనకు చెప్పినా చెప్పకున్నా తనకు ఇష్టం లేనివి చేయడు. విడిపోవాలనో, ఇంకేదో అభిప్రాయం తనకు కూడా ఉంటేనే అలా జరుగుతుంది. పైగా జరిపించగలిగే ఆర్థిక, 'పితృస్వామిక' సామర్థ్యమూ అతనికే ఉంది.

కాబట్టి అన్ని అనర్థాలకూ కారణం స్త్రీయనో, నిర్దిష్టంగా కోడలనో అనడమంటే పురుషుల క్రియలకు స్త్రీలను బాధ్యులను చేయడం తప్ప మరొకటి కాదు. స్త్రీని ఆస్తిగా చూసే దుస్థితి పోయినపుడు, ఆమెను మనిషిగా చూసే సంస్కారం పెరిగినపుడు ఈ భావనలు పోతాయి. అప్పటివరకు ఇలాంటి వ్యాఖ్యానాలను వాడుకలోకే రానీయకూడదు. ★

పాఠక స్పందన

ఆలోచింపజేసిన కార్టూన్‌లు

నవంబర్ 10 ఆదివారం ప్రజాశక్తిలో కార్టూన్ కదంబంలోని కార్టూన్‌లు ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. పాక్ అధ్యక్షుడి వైఖరి తెలుపుతూ వేసిన కార్టూన్ అక్కడి వాస్తవానికి అద్దం పడుతోంది. శీర్షికలన్నీ బాగున్నాయి. బాలవికాసం పేజీ నాణ్యత పెంచితే బాగుంటుంది. రేఖాచిత్రాలను మరింత ఆకర్షణీయంగా వేయిస్తే సంచిక ఇంకా ఆకర్షణీయంగా ఉంటుంది.

– కె.రాజు, కింగ్‌కోఠి, హైదరాబాద్

'టెర్రకోట' బొమ్మలు అద్భుతం

నవంబర్ 10వ తేదీ సంచికలో కళాసాహితి శీర్షికన ప్రచురించిన 'మనసుదోచే టెర్రకోట' చాలా బాగుంది. ఆ బొమ్మలు అంతర్జాతీయ ఖ్యాతిని గడించడం అభినందనీయం. మృత్తికకు ఆకృతినిచ్చి అందచందాలు దిద్ది జీవం పోసిన కళాకారుడు వెంకట రమణ అభినందనీయులు.

– మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా

'హలో! హలో!!' బాగుంది

3వ తేదీ సంచికలో టెలిఫోన్ విప్లవంపై 'ఎక్కడున్నా ఏం చేస్తున్నా హలో! హలో!!" అంటూ అందించిన కథనం ఆద్యంతం ఆసక్తి దాయకంగా ఉంది.

– కోనే సతీష్ కుమార్, చిన్నబజార్, శ్రీకాకుళం జిల్లా

కథ బాగుంది

3వ తేదీ సంచికలో ప్రచురించిన కథ 'బట్టలు' చాలా బాగుంది.

– ఎల్లారెడ్డి, హన్మకొండ

శాస్త్రీయమైన బాలల కథ

3వ తేదీ సంచికలో ప్రచురించిన బాలల కథ 'ఆదర్శ రాజ్యం' చాలా శాస్త్రీయంగా బాలల్ని ఆలోచింప చేసేదిగా ఉంది

– కేత నర్సింహమూర్తి, పాలమూరు, ప.గో.జిల్లా